Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 41 | శనివారం 19 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఢిల్లీలో దారుణం

- బాలికపై సామూహిక లైంగికదాడి.. హత్య
- కుళ్లిన స్థితిలో మృతదేహం.. శరీర భాగాలను పీక్కుతిన్న కుక్కలు
- 50కి పైగా సీసీటీవీ కెమెరాల పరిశీలన..
- నలుగురు నిందితుల అరెస్టు
- బీజేపీ పాలనలో గాలిలో దీపంలా మహిళల భద్రత



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

హత్యకు సంబంధించిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని ఔటర్ ఢిల్లీ పరిధిలో స్వరూప్ నగర్ ప్రాంతంలో బాలిక మృతదేహం తీవ్రంగా ఛిద్రమైన స్థితిలో లభ్యమైంది. ఈ కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ముగ్గురు మైనర్లు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. సెప్టెంబర్ 13 ఉదయం కుషక్ రోడ్డులోని జైపాల్ రాణా ఫామ్‌హౌస్ దగ్గర ఉన్న బహిరంగ ప్రదేశంలో గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. స్వరూప్ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. మృతదేహం తీవ్రంగా కుళ్లిపోవడంతో తొలుత మృతురాలి ఆడ, మగ అనేది కూడా నిర్ధారించలేక పోయినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహంలోని కొన్ని భాగా లను వీధి కుక్కలు పీక్కుతిన్నాయి. ఒక చేయి శరీరం నుంచి విడిపోయి కనిపిం చింది. దీంతో మృతదేహాన్ని గుర్తించడం పోలీసు లకు కష్టంగా మారింది. క్రైమ్ టీమ్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) బృందాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. 50కి పైగా సీసీటీవీ ఫుటేజీల పరిశీలన కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సంఘటనా స్థలం, పరిసర రహదారుల్లోని 50కి పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అదనపు డీసీపీ లోకేశ్ వారణ్ వివరాల ప్రకారం.. సంఘటన జరిగిన సమయంలో అనుమానాస్పద టెంపో ఒకటి ఆ ప్రాంతంలో సంచరిం చినట్టు ఫుటేజీల్లో గుర్తించారు. సెప్టెంబర్ 15 రాత్రి ఖడ్డా కాలనీలో టెంపోను గుర్తించిన పోలీసులు దాని డ్రైవర్‌ను విచారించారు. అనంతరం నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసుల

- మిగతా 2లో..



## హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులో 9 మందికి జీవిత ఖైదు

హైదరాబాద్ - సూర్య వాస్తవం

2019లో బంగ్లాదేశ్ నుంచి మహిళలను అక్రమంగా భారత్‌కు తరలించిన కేసులో 9 మంది నిందితులకు హైదరాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జీవిత ఖైదును విధించింది. వీరిలో 8 మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నారు. మహిళలకు ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించిన నిందితులు వారిని బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దీనిపై 2019లో పోలీసులు కేసు నమోదు చేయగా ఏన్ఐఏ అధికారులు రీ-రిజిస్టర్ చేశారు. ఏ1 నుంచి ఏ12 వరకు మొత్తం 12 మందిపై చార్జిషీట్ దాఖలు చేశారు.



## పాదయాత్రకు వాంగ్‌చుక్ సన్నద్ధం

### - వచ్చే వారం లేహ్‌లో ప్రారంభం

లేహ్- సూర్య వాస్తవం

గత ఏడాది సెప్టెంబర్‌లో లడఖ్‌కు రాష్ట్ర హోదా కోసం పర్యావరణ కార్యకర్త వాంగ్ చుక్ నేతృత్వంలో విద్యార్థులు సాగించిన ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో నలుగురు సాధారణ పౌరులు మరణించగా, అనేక మందికి గాయాలయ్యాయి. నిరాహార దీక్షలో ఉన్న వాంగ్‌చుక్‌పై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద కేసు నమోదు చేసి, ఆరు నెలల పాటు జోధ్‌పూర్ జైలులో నిర్బంధించారు. అయితే, ఈ ఉద్యమ మొదటి వార్షికోత్సవం సందర్భంగా, సోనమ్ వాంగ్‌చుక్ వచ్చే వారం లేహ్‌లో 20 కిలోమీటర్ల పాదయాత్రను ప్రకటించారు.

- మిగతా 2లో..



## ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

### - మమతా బెనర్జీ

హైదరాబాద్ - సూర్య వాస్తవం

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) జారీ చేసిన ఎన్నికల గుర్తుల మార్పులపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ శుక్రవారం తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యలతో కూడిన రాజ్యాంగ విరుద్ధ చర్య అని ఆమె అభివర్ణించారు.

- మిగతా 2లో..

# మోడీ వేడుకలకు ప్రజాధనం

ప్రధాని మోడీని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచార వేడుకలుగా మార్చుతున్నాయి బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు. దీనిపై ఇప్పటికే దేశ ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబర్ 17న ఆయన జన్మదిన వేడుకల నుంచి 25 ఏండ్ల 'ప్రజా జీవితం' అంటూ ప్రజాధనంతో భారీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దేశ ప్రజల కష్టాలు, బాధలు పట్టని బీజేపీ ప్రభుత్వాలు.. మోడీ జన్మదినం, ఆయన రాజకీయ జీవితంలో మైలురాయిని ఒక వేడుకల నిర్వహిస్తూ, ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం ఏంటనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం మోడీ వ్యక్తిగత ప్రతిష్టను పెంచేలా ప్రభుత్వ కార్యక్రమాలను ఆయనతో ముడిపెడుతూ పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఇందుకు వందకోట్లకు పైగానే ఖర్చు చేసింది. ప్రస్తుతం బీజేపీ 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెలపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్న తరుణంలో ఈ విషయం మరోసారి చర్చకు వచ్చింది.

- గతేడాది ప్రచారానికి మొత్తం రూ.108 కోట్లు
- తొమ్మిది రోజుల్లోనే రూ.14 కోట్లు ఖర్చు!
- మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ప్రభుత్వ తీరిది
- ప్రధాని జన్మదినం, పదవీకాల మైలురాళ్ల పేరుతో ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు- మరోసారి తెరపైకి ఖర్చుల వివరాలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాని మోడీ జన్మదినం మరోసారి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు కేంద్రంగా మారింది. మోడీ జన్మదినం సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వం, బీజేపీ కలిసి 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 18 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమ య్యాయి. అదే సమయంలో హర్యానా ప్రభుత్వం ఈ కార్యక్రమాల కోసం ప్రతి డిప్యూటీ కమిషనర్‌కు రూ.10 లక్షలు కేటా యించింది. దీంతో గతంలో గుజరాత్‌లో మోడీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వార్షికోత్సవాల సందర్భాలను పురస్కరిం చుకుని కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన వివరాలు




ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**మోడీ ప్రచార వేడుకలకు ప్రజాధనం**

ప్రధాని మోడీ జన్మదినం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని మైలురాళ్లను పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు,

- మిగతా 2లో..



## 9.56 లక్షల ఇండ్లు కేటాయించండి

### - కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్ - సూర్య వాస్తవం

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. పీఎంఏవైజీ పథకం కింద మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మరో 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు

- మిగతా 2లో..



## ప్రపంచం చూపు హైదరాబాద్ వైపు

### - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో




## అమరావతిలో మాస్ ట్రాన్స్‌పోర్టేషన్, అసెంబ్లీపై స్పియర్ టవర్

- సీఆర్డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు
- అసెంబ్లీ భవనంపై రూ.661 కోట్లతో స్పియర్ టవర్ నిర్మాణానికి ఆమోదం
- రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు రూ.1548 కోట్ల టెండర్లకు గ్రీన్ సిగ్నల్
- విజయవాడ-గుంటూరును కలుపుతూ మాస్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థకు ప్రణాళికలు
- ఎకరం లోపు రైతులకు కూడా యాన్యుటీ చెల్లింపునకు సమావేశం అంగీకారం

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. రాజధాని నగరానికి మకుటాయమానంగా నిలిచేలా అసెంబ్లీ భవనంపై 250 మీటర్ల ఎత్తైన స్పియర్ టవర్ నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. స్పియర్ టవర్, లిఫ్టుల నిర్మాణం కోసం రూ.661 కోట్ల వ్యయానికి సమావేశం అంగీకారం తెలిపింది. ప్రజాస్వామ్యానికి దేవాలయమైన అసెంబ్లీ భవనంపై నిర్మించే ఈ స్పియర్, ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా, ఓ వ్యూ పాయింట్‌తో సహా నిర్మించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లోని

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## రహీం ఖాద్రి మసీదులో...
## వక్ఫ్ బోర్డు సీఈఓ జుమా నమాజ్...!

- జమాత్ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించిన యాకూబ్ బాషా
- వక్ఫ్ బోర్డు సీఈఓ కోసం ప్రత్యేక దువా చేసిన జమాత్ సభ్యులు
- మసీదుకు వచ్చిన యాకూబ్ బాషాకు ఘన సత్కారం చేసిన షకీల్ షఫీ



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అశోక్ నగర్‌లో రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ నిర్మించిన రహీం ఖాద్రి మసీదును రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ జనాబ్ కె. యాకూబ్ బాషా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మసీదులో జుమా నమాజ్ నిర్వహించారు.మసీదుకు తొలిసారిగా విచ్చేసిన సీఈఓ యాకూబ్ బాషాను అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మసీదు పరిసరాలతో పాటు స్మశాన వాటికను యాకూబ్ బాషా పరిశీలించారు.మసీదు పరిసరాల్లోని ప్రశాంతమైన వాతావరణాన్ని ఆయన ప్రశంసిస్తూ, ఇక్కడ నమాజ్ చేయడం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో నమాజ్ చేసిన అనుభూతిని కలిగిస్తోందని పేర్కొన్నారు. అనంతరం జమాత్ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు.చివరగా అల్హాజ్ కె.యం. షకీల్ షఫీతో పాటు జమాత్ సభ్యులు యాకూబ్ బాషా కోసం ప్రత్యేక దువా చేశారు.

## ఎమ్మెల్యే శ్రావణి, తల్లి లీలావతిలకు కనుంపల్లి రైతుల విజ్ఞప్తి

**గార్లదిన్నె– సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలంలోని కనుంపల్లి గ్రామ రైతులు మాకు న్యాయం చేకూర్చాలని సింగనమల నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రావణికి, ఆమె తల్లి లీలావతికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా మాగ్రామరైతుల భూములకు ప్రభుత్వం ఎకరానికి 20 లక్షల రూపాయలు చొప్పున పరిహారం చెల్లిస్తుందని, మా రైతులతో తమరి అనుచరులు బంధువులు ఇంటి దగ్గరకు పిలిపించి పంచాయతీలు చేసి రైతుల నుంచి ఎకరాకు 15000 చొప్పున తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. దయచేసి మా రైతులకు అన్యాయం చేయకండి దీనివల్ల ప్రభుత్వానికి తమరికి చెడ్డ పేరు వస్తుందని పత్రికా ప్రకటన ద్వారా వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ గ్రామ రైతులకు న్యాయం చేకూర్చాలని వారు వేడుకుంటున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

- వంటికాళ్లపై నిలబడి వీఆర్ఎల నిరసన



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం 3వరోజు ఒంటి కాళ్లపై నిలబడిన వినూత్న కార్యక్రమం చేప ట్టారు.వీఆరీ సంఘం అధ్యక్షుడు సు ధాకర్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.ఉ ద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్య క్షుడు సుధాకర్,వైస్ ప్రెసిడెంట్ పెద్దన్న, రాంప్రసాద్, వినోద్, నారాయణ స్వామి, జగదీష్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన వేరుశనగ పంటను తొలగించిన రైతు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం శ్రీపురం గ్రామంలో లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కార ణంగా రైతులు సాగు చేసిన పంట లు ఎండిపోతున్నాయి.ఇప్పటికే కొ న్ని ప్రాంతాల్లో ఎండిపోయాయి.శ్రీపురం గ్రామంలో రైతు గోవిందు మూ డున్నర ఎకరాల్లో సాగు చేసిన వేరు శనగ పంట వర్షాభావం కారణంగా పూర్తిగా ఎ డిపోయింది.గుంటక సాయంతో ఎండిపోయిన వేరుశనగపం టను తొలగించాడు. భారీగా నష్టం వాటిలినట్లు బాధిత రైతు వాపో యాడు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరాడు.

# ట్రెల్లీస్ స్కూల్ ఘటనపై...
# సమగ్ర విచారణకు డిమాండ్...!

- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి
- ప్రైవేటు పాఠశాలల్లో చదవడమే ప్రతిష్ఠగా భావించే దుస్థితి
- విద్యార్థుల భద్రతపై ప్రభుత్వ పర్యవేక్షణ ఎక్కడ ? కేవీ రమణ వైసీపీ



**అనంతపురం – సూర్య వాస్తవం :** “విద్య లేని వాడు వింత పశువు” అన్నారు పెద్దలు. అందుకే విద్య ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో భారత రాజ్యాంగం విద్యకు ప్రాధాన్యత కల్పించింది. అయితే నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు ప్రైవేటు విద్యా సంస్థలపై ఆధారపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.అనంతపురంలోని ట్రెల్లీస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు సంబంధించిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అభం శుభం తెలియని చిన్నారికి అన్యాయం జరిగిందనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. విద్యాసంస్థల్లో పిల్లల భద్రతకు సంబంధించి యాజమాన్యాలు, అధికారులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉంది.పోటీ ప్రపంచంలో తమ పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను ప్రైవేటు విద్యా సంస్థలు వినియోగించు కుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులకు, అదే సమయంలో తమ పిల్లల భద్రతపై ఆందోళన కలగడం బాధాకరమైన విషయం.ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం కంటే ప్రైవేటు పాఠశాలల్లో చదవడమే ప్రతిష్ఠగా భావించే పరిస్థితి కూడా ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రజల్లో నమ్మకం తగ్గి, ప్రైవేటు విద్య వైపు మొగ్గు పెరుగుతోంది. ఇది విద్యారంగంలో చర్చించాల్సిన ముఖ్యమైన అంశం. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. విద్యను కేవలం వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వాలు, విద్యాసంస్థల ప్రధాన బాధ్యత.మైనర్ బాలికలపై లైంగిక దాడుల ఆరోపణలు, ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగం, విద్యార్థులు––ఉపాధ్యాయుల మధ్య ఘర్షణలు వంటి ఘటనలు ఎక్కడైనా చోటుచేసుకుంటే వాటిని కఠినంగా అరికట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాలు, ఫిర్యాదు వ్యవస్థలు, సిబ్బంది వెరిఫికేషన్, పిల్లల రక్షణ నిబంధనల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి.విద్యాసంస్థల్లో ఏదైనా ఘటన చోటు చేసుకున్నప్పుడు దానిని దాచిపెట్టడం లేదా ప్రభావితం చేయడం కాకుండా, పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు నిజమైన సమాచారం అందేలా చూడాలి.

మీడియా కూడా ఇటువంటి సున్నితమైన ఘటనలను బాధ్యతాయుతంగా కవర్ చేయాలి. బాధిత చిన్నారుల గోప్యతను కాపాడుతూ, వాస్తవాలను మాత్రమే ప్రజలకు తెలియజేయాలి. డబ్బులు, రాజకీయ లేదా ఇతర ప్రభావాలకు వార్తా ప్రసారాలు ప్రభావితం కాకుండా మీడియా తన విశ్వసనీయతను కాపాడుకోవాలి.“బేటీ బచావో.. బేటీ పడావో” వంటి నినాదాలు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. ప్రతి ఆడబిడ్డకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలి. ప్రభుత్వాలకు విద్య పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు విద్యాసంస్థలపై సమర్థవంతమైన నియంత్రణ, నిరంతర తనిఖీలు, విద్యార్థుల భద్రతా ప్రమాణాల అమలును కట్టుదిట్టం చేయాలి.విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాల్లో ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయడం సమాజ భవిష్యత్తుకు అవసరం. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా చర్యలు తీసుకోవాలి. విద్యే నిజమైన సంపద. విద్యార్థుల భద్రతే మొదటి బాధ్యత. ఆ బాధ్యతను ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం కలిసి నిర్వర్తించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుంది.

## ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**తనకల్లు – సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వంతో ప్రతి సమస్యకు పరిష్కారం.ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని, అధికారులను సమన్వయం చేసి పరిష్కారం చూపుతున్న కూటమి ప్రభుత్వాన్ని చూసి ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పాలన సాగిందని విమర్శించారు. “అప్పుడు ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎవరిని కలవాలో తెలియని పరిస్థితి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని, అధికారుల సమక్షంలో పరిష్కారం చూపిస్తున్నాం అని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతుల కష్టాలు వచ్చిన తర్వాత స్పందించడం కాదు.. ముందుగానే పరిస్థితులను



అంచనా వేసి చర్యలు తీసుకోవడమే చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం అని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ప్రజలను గాలికి వదిలేసిన వారు.. ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా విమర్శలు చేయడం కాదు.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలే గమనిస్తున్నారు అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని, కదిరి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో...
# రక్తదాత కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్...!

**హిందూపురం – సూర్య వాస్తవం :** సామాజిక సేవ, సాహిత్య రంగాల్లో విశేష సేవలందిస్తున్న కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు అరుదైన గుర్తింపు లభించింది. గత 25 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగిస్తున్న మానవతా రక్తదాన సేవలను గుర్తిస్తూ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆయన పేరును రికార్డులో నమోదు చేసింది.టిప్పు సుల్తాన్ షహీద్ మానవతా రక్తదాన సంఘం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 25 ఏళ్లుగా రక్తదాన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలసీమియా చిన్నారులు, ప్రసూతులు, శస్త్రచికిత్సలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలను సమన్వయం చేసి సేవలందించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 26 వేల రక్తదాన కేసులకు దాతలను సమకూర్చినట్లు, ఉమర్ ఫారూఖ్ ఖాన్ స్వయంగా 66





సార్లు రక్తదానం చేసినట్లు రికార్డు ధ్రువపత్రంలో పేర్కొన్నారు. 2026 సెప్టెంబర్ 18న ఈ రికార్డు ధ్రువపత్రాన్ని అందించినట్లు తెలిపారు.రక్తదాన సేవలతో పాటు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, పలు సామాజిక సేవా కార్యక్రమా లను చేపట్టడం ద్వారా ఉమర్ ఫారూఖ్ ఖాన్ సమాజానికి సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఆయన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పురస్కా రాలు, సత్కారాలు అందుకున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సాహితీ వేత్తలు, రచయితలు, రక్తదాతలు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు, మిత్రులు, అభిమానులు ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ “రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలుగా మారుదాం.. కులమతాల అడ్డుగోడలను కూలుద్దాం.. వసుధైక కుటుంబాన్ని నిర్మిద్దాం” అనే ఆశయంతో తమ సంస్థ సేవలను కొనసాగిస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత మంది రక్తదాతలను సమన్వయం చేసి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు మరింత విస్తృతంగా సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ రికార్డు సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రిని... కలిసిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**- రాష్ట్ర ఆర్థిక అంశాలు, కేంద్ర సహకారంపై చర్చ**



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు ఆర్థిక అంశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, రాష్ట్ర ఆర్థిక పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన ఆర్థిక చర్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందాల్సిన అంశాలను మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వానికి కేంద్ర సహకారం మరింతగా అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

## దోమలపై జీవ నియంత్రణ అస్త్రం గంబుషా చేపలు...!

**- సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని విడపనకల్లు వైద్యాధికారి డాక్టర్ ఎం.పుష్ప సూచించారు. శుక్రవారం మాలాపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధులు, దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అనంతపురం మత్స్యశాఖ నుంచి తీసుకువచ్చిన 15 వేల గంబుషా చేప పిల్లలను మాలాపురం గ్రామంలోని వర్షపు నీరు నిల్వ ఉన్న కుంటలో వదిలారు. దోమల గుడ్లు, లార్వాలను పూర్తిగా నియంత్రించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డాక్టర్ పుష్ప తెలిపారు. దోమల లార్వాలు అధికంగా వృద్ధి చెందే నిల్వ నీటి కుంటలు, ఇతర ప్రాంతాల్లో గంబుషా చేప పిల్లలను వదులుతున్నట్లు ఉరవకొండ డివిజన్ మలేరియా ఉపవిభాగ అధికారి బత్తుల కోదండరాంరెడ్డి తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను తినడం ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రసాయన మందుల వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణహిత జీవ నియంత్రణ పద్ధతిలో భాగంగా గంబుషా చేపలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కుంటలో దోమల లార్వాలను నియంత్రించేందుకు మగ, ఆడ చేప పిల్లలను వదిలినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు మండల విస్తరణాధికారి సత్యబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శులు రమేష్, మునాఫ్, ఆరోగ్య పర్యవేక్షకులు కంబయ్య, ఆరోగ్య సహాయకుడు నూర్మొహమ్మద్, గ్రామీణ ఆరోగ్య వైద్య నిపుణురాలు శారదమ్మ, ఏఎన్ఎం హేమలత, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వినాయకుల విగ్రహాల నిమజ్జనం

**- గంగమ్మ ఒడిలోకి గణపతులు చేరగానే భారీ వర్షం**



**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పెద్దవడుగూరు గ్రామంలో కొలువైన భారీ వినాయకుని విగ్రహాలను గురువారం అంగరంగ వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. పెద్దవడుగూరు నందు దళితవాడలో బారీ విగ్రహాలను ఏర్పాటు ఏర్పాటు చేయడం వీరికి ఆనవాయితీ. ప్రతి ఏటా మాదిరిగానే ఈసంవత్సరం కూడా మేల తాళాలతో, డ్రమ్స్ డీజే వాయి ద్యాలతో యువకులు నృత్యములతో, కేరింతలతో భారీగా ఊరేగింపుగా వెళ్లి వినాయకుల నిమజ్జన కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ హాజరై వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఎంతో ఉల్లాసంగా జరుపుకోవడం జరిగింది. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నరేంద్రారెడ్డి పర్యవేక్షణలో బంధావస్తు కల్పించారు. అనంతరం వినాయకుల నిమజ్జన కార్యక్రమం పూర్తి కాగానే కనీవిని ఎరుగని రీతిలో భారీగా కుంభవర్షం కురిసింది. వంకలు వాగులు తెగి పారుతున్నాయి. రైతులు,ప్రజలందరూ ఆనందంతో అర్షద్వానాలతో కేరింతలు పెట్టారు.

# ఘోర రోడ్డు ప్రమాదం....!

- రోటరీపురం సమీపంలో అదుపుతప్పిన టాటా సఫారీ
- రోడ్డు పక్కన హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా
- ఇద్దరు యువ నర్సులు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- అతివేగమే కారణమా? ఇతర కోణాల్లోనూ పోలీసుల దర్యాప్తు





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం సమీపంలో వేగంగా వెళ్తున్న టాటా సఫారీ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువ నర్సులు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను గుత్తి మండలానికి చెందిన హరిత (20), తాడిపత్రి మండలం నిడిగల్లు గ్రామానికి చెందిన నవనీత (20)గా గుర్తించారు. వీరిద్దరూ అనంతపురంలోని త్రిపుర ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సులుగా పనిచేస్తున్నారు. హరిత నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతూనే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇద్దరూ స్నేహితులు కావడంతో అనంతపురంలోని ఒకే ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. సోమవారం రాత్రి హరిత, నవనీత తమ స్నేహితులైన అదే ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వినయ్ కుమార్, ఇన్సూరెన్స్ విభాగంలో పనిచేస్తున్న శ్రీధర్ రెడ్డితో కలిసి ఏపీ40 ఈజెడ్1611 నంబర్ గల టాటా సఫారీ కారులో బయటకు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో రోటరీపురం సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా హరిత, నవనీత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన వినయ్ కుమార్, శ్రీధర్ రెడ్డికి చికిత్స కొనసాగుతోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అతివేగమే కారణమా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!
- రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, డ్రైనేజీ సమస్యలపై వినతులు
- ఎమ్మెల్యే చొరవతో 30 మంది మున్సిపల్ కార్మికులకు ఉద్యోగాలు
- ఉద్యోగాలు కల్పించడంతో ఎమ్మెల్యేను సత్కరించిన మున్సిపల్ కార్మికులు



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 59వ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. స్థానిక, మౌలిక వసతులు, రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అందిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజా దర్బార్ వేదికగా ఉపయోగపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.




**మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఫలితం.. 30 కుటుంబాలకు ఉద్యోగాలు**

గత మూడేళ్లుగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి ఫలితం లభించిందని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక చొరవతో అనంతపురం నగరపాలక సంస్థలో 30 మందికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారు. ఈ నేపథ్యంలో కార్మికులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చాలాకాలంగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే చొరవతో ఇటీవల మరణించిన కార్మికుల కుటుంబాల్లో 12 మందికి, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబాల్లో 18 మందికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. 30 నుంచి 40 ఏళ్ల పాటు మున్సిపల్ కార్మికులుగా సేవలందించి పదవీ విరమణ అనంతరం ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా నిలవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమితులైన వారిని భవిష్యత్తులో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నగర జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా అదనపు మున్సిపల్ కార్మికులను నియమించి పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్మికుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ప్రత్యేక అధికారి, కమిషనర్‌కు సీఐటీయూ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు, మున్సిపల్ కార్మికులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రదేశాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా ఎస్పీ...!

- నిమజ్జన వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ
- అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట బందోబస్తు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రధాన నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా, రక్షణ చర్యలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పంపనూరు హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భద్రతా చర్యలను ప్రత్యేకంగా పరిశీలించారు. రాచానపల్లి అక్కమ్మ గార్ల గుడి చెక్‌డ్యామ్ వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని లైటింగ్, ఫెన్సింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. రాచానపల్లి న్యూ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నిమజ్జన వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్ సర్వీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జనోత్సవాల్లో భక్తులు పోలీసులకు సహకరించి, నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు.

# మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి

# ప్రేత్యేక ప్రాధాన్యత:మైనారిటీ చైర్మన్ నసిర్ అహ్మాద్

**- అనంతపురం అర్బన్‌లో ప్రత్యేక డిగ్రీ, ఇంటర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి -మైనారిటీల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి -విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరం: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ -మైనారిటీల సంక్షేమంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి : కలెక్టర్ ఓ ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి మైనారిటీ కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, వక్ఫ్ బోర్డు సీఈవో యాకుబ్ భాష, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ పి. జగదీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం జిల్లా వెనుకబడిన ప్రాంతంగా ఉందని, జిల్లాలో మూడు లక్షలకు పైగా మైనారిటీ జనాభా ఉందన్నారు. మైనారిటీ వర్గాల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక డిగ్రీ కళాశాల, ఒక ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటు చేయాలని మైనారిటీల సంక్షేమ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. విద్య ద్వారా మైనారిటీ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన మసీదులు, చర్చిలకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం వాటిని త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.మైనారిటీలకు అందాల్సిన రుణాలు, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని అన్నారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనంతపురం జిల్లాలో మైనారిటీల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ పర్యటించడం ఇదే తొలిసారి అని ఎమ్మెల్యే తెలిపారు. రెండు రోజుల పర్యటనలో జిల్లాలోని మైనారిటీలకు సంబంధించిన అనేక సమస్యలను కమిటీ గుర్తించడం అభినందనీయమన్నారు. మైనారిటీల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మైనారిటీ వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో మైనారిటీ వర్గాల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనం, శోభాయాత్రలో డ్రోన్లతో నిఘా

**- అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు**





**అనంతపురం -సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర వేళ అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు, భక్తులకు మరియు వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు.ఇందులో భాగంగా శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాలు, రద్దీ కూడళ్లపై డ్రోన్ కెమెరాల ద్వారా ముమ్మర నిఘా ఏర్పాటు చేశారు.
**డ్రోన్లతో కంట్రోల్ రూమ్ నిఘా:** నగరంలోని సున్నిత ప్రాంతాలు, ప్రధాన కూడళ్లపై డ్రోన్లను ఎగురవేస్తూ కంట్రోల్ రూమ్ నుంచి క్షణక్షణం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణ : డ్రోన్ దృశ్యాల ఆధారంగా రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వెంటనే అక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.
**శాంతిభద్రతల రక్షణ:** అనుమానాస్పద వ్యక్తులు లేదా అవాంఛనీయ చర్యలకు పాల్పడే వారిపై డ్రోన్ల ద్వారా ప్రత్యేక కన్ను ఉంచినట్లు అధికారులు తెలిపారు.శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## 4వ రోజు కొనసాగుతున్న విఆర్ఎల సమ్మె



**పామిడి -సూర్య వాస్తవం:** పామిడి మండల వ్యాప్తంగా జరుగుతున్న తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 4 వ రోజు శుక్రవారం మండల విఆర్ఎలు చేపట్టిన సమ్మె పామిడి తహశిల్దార్ కార్యాలయం ఆవరణలో కొనసాగింది. ఈ సమ్మెలో విఆర్ఎ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ శంకరయ్య వైస్ ప్రెసిడెంట్ తిరుపతయ్య సుంకన్న ప్రసాద్ రామాంజనేయులు సువర్ణ జయరాం పని సుంకన్న వినోదం అశోకు వెంకటేశు ఎద్దులపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సనపలో గాలివాన బీభత్సం...

# నేలకొరిగిన అరటి తోటలు...!

**- 60 ఎకరాలకు పైగా అరటి పంటకు తీవ్ర నష్టం**
**- ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి.. చేతికందే సమయంలో ప్రకృతి దెబ్బ**
**- పంట నష్టంతో లబోదిబోమంటున్న అరటి రైతులు**
**- నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్**
**- దెబ్బతిన్న తోటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**



**అనంతపురం - సూర్య వాస్తవం :** గురువారం రాత్రి వీచిన తీవ్ర గాలులు, కురిసిన వర్షానికి ఆత్మకూరు మండలం సనప గ్రామంలో అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలుల ధాటికి 60 ఎకరాలకు పైగా అరటి తోటలు నేలకొరిగాయి. పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సనప గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి 5 ఎకరాలు, ఉమ్మడి నాగిరెడ్డి 5 ఎకరాలు, ఉమ్మడి కొండారెడ్డి 5 ఎకరాలు, ఉమ్మడి చంద్రారెడ్డి 5 ఎకరాలు, మల్లారెడ్డి 4 ఎకరాలు, ఉమ్మడి రాజారెడ్డి 6 ఎకరాలు, ఉమ్మడి ఆదినారాయణరెడ్డి 5 ఎకరాలు, సూర్యనారాయణరెడ్డి 10 ఎకరాలు, శంకర్‌రెడ్డి 10 ఎకరాలు, కురుమ రామాంజనేయులు 5 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు.

**గాలుల ధాటికి నేలమట్టం**
తీవ్రంగా వీచిన గాలులకు అరటి చెట్లు ఒక్కసారిగా నేలకొరిగాయి. దీంతో తోటల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో పాటు తోటల నిర్వహణకు చేసిన పెట్టుబడులు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. దెబ్బతిన్న తోటలను తొలగించి తిరిగి సాగు చేపట్టాల్సి రావడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడనుంది.

**తోటలను పరిశీలించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**
పంట నష్టం విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం సనప గ్రామానికి వెళ్లి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట సాగుకు చేసిన పెట్టుబడులు, జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రకాష్‌రెడ్డి కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**అప్పుల భారం.. రైతుల్లో ఆందోళన**
పంట చేతికందే సమయంలో తోటలు నేలకొరగడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేసిన అప్పులకు తోడు దెబ్బతిన్న తోటలను తొలగించి మళ్లీ సాగు చేపట్టేందుకు కొత్తగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని నమోదు చేసి, బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



## నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**- సీపీఐ నాయకుల డిమాండ్ చేసిన**

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలశీ పరిధిలో పంటలు నష్టపోయిన రైతులను.రాష్ట్ర ప్రభు త్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ నాయకుల డిమాండ్ ఈ సందర్భంగా, సీపీఐ,జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి,మండల కార్యదర్శి, రామదాసు,పట్టణ కార్యదర్శి, రాజు, నియోజకవర్గ,నాయకులు,రమేష్ బాబు, మాట్లాడుతూ, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులు వర్షాభావ పరిస్థితులు,పంట ది గుబడి తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నాయ కులు తెలిపారు.రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొ న్నారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని వారు కోరారు.పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి ఎకరాకు.ప్రతి రైతుకు తక్షణమే రెండు లక్షల వరకు పరి హారం అందించాలని.క్రాఫ్ లోన్లు ఇ వ్వలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు.అలాగే రైతులకు పంట నష్టపరి హారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలి చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్య లు చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తుం దని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వీరభద్రస్వామి,నియోజకవర్గ కార్య దర్శి,రమేష్ బాబు, మండల కార్య దర్శి,రామదాసు,పట్టణ కార్యదర్శి, రాజు యాదవ్,పట్టణ సహాయ కార్యదర్శి,నజీర్,మండల సహాయ కార్యదర్శులు, వెంకటరాముడు, నరసింహయ్య, మధు, సీనియర్ నాయకులు, షఫీ, రామకృష్ణ, టీఎం భాష, బెస్త శివకుమార్, మహిళా నాయకు రాలు, నూర్జహాన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సూర్య వాస్తవం కథనానికి స్పందన..

## - సెంటర్ లైట్లకు మరమ్మతులు

**- వెలుగులు పునరుద్ధరించిన మున్సిపల్ సిబ్బంది**
**- సమస్యను పరిష్కరించడంపై స్థానికుల హర్షం.. అధికారులకు, సూర్య వాస్తవానికి కృతజ్ఞతలు**



**నాయుడుపేట- సూర్య వాస్తవం :**నాయుడుపేట పట్టణంలోని బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో సెంటర్ లైటింగ్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సూర్య వాస్తవం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించారు.సమస్యను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది సంబంధిత సెంటర్ లైట్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. అనంతరం లైట్లకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి వెలుగులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైల్వే స్టేషన్ మార్గంలో రాత్రి వేళల్లో నెలకొన్న చీకటి సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది.బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే మార్గంలో రాత్రి, తెల్లవారుజామున ప్రయాణించే వారికి సెంటర్ లైట్లు వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. రహదారికి ఇరువైపులా మెకానిక్ దుకాణాలు ఉండటంతో వ్యాపారులు సైతం భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై సూర్య వాస్తవం దినపత్రికలో కథనం ప్రచురితమైన అనంతరం మున్సిపల్ సిబ్బంది స్పందించి తక్షణ చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సూర్య వాస్తవం దినపత్రికకు, సమస్య పరిష్కారానికి స్పందించిన మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి స్థానికులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఇదే విధంగా స్పందించి, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కనెక్షన్లకు బదులుగా శాశ్వత విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి సెంటర్ లైటింగ్ నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.








## రైతులకు ఉపయోగకరమైన ఉపాధి హామీ పనులనే చేపట్టాలి

**- "కలెక్టర్ డా,,వెంకటేశ్వర్ "**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి:- రామచంద్రాపురం మండల పరిధిలోని కమ్మపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ వెంకటేశ్వర్,పిడి మద్దిలేటి తో కలసి శుక్రవారం పరిశీలించారు.కమ్మపల్లి గ్రామానికి చెందిన రైతు మునిరత్నం నాయుడుకు చెందిన పొలంలో చేపడుతున్న ఫార్మ్ పాండ్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఒక ఎకరం విస్తీర్ణంలో ఉన్న మామిడి తోటకు ప్రస్తుతం నీటి సరఫరా సక్రమంగా అందడం లేదని రైతు కలెక్టర్‌కు వివరించారు.ఫార్మ్ పాండ్ నిర్మాణం పూర్తయిన అనంతరం వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని, తద్వారా తన మామిడి తోటకు అవసరమైన నీటిని అందించుకునేందుకు వీలవుతుందని రైతు తెలిపారు.ఈ పనితో తన వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ప్రభుత్వం చేపడుతున్న ఈ పనిపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ ఫార్మ్ పాండ్ పనికి రూ.62,820 అంచనా వ్యయం కాగా,ఇప్పటివరకు రూ.21,030 మేరకు ఖర్చు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పనుల్లో పాల్గొంటున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ ఏడాది ఇప్పటివరకు చేపట్టిన పనులు,రోజువారీగా లభిస్తున్న సగటు వేతనం,వేతనాలు సకాలంలో అందుతున్నాయా అనే వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు.ఉపాధి హామీ కూలీలు ప్రస్తుతం కల్పిస్తున్న 125 రోజుల పనిదినాలకు అదనంగా మరో 25 రోజులు పని కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్,అదనపు పనిదినాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి తెలిపారు.రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరేలా,వ్యవసాయ ఉత్పాదకతను పెంచే విధంగా ఫార్మ్ పాండ్లు,నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.



ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు స్థిరమైన ఆస్తులు,వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ సచివాలయాల వ్యవస్థ ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి,ఉపాధి హామీ పథకం సహాయ ప్రాజెక్టు అధికారి,పనుల పర్యవేక్షకులు,సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిఅథ్లెటిక్స్ పోటీలక ఎంపికైన మంగళ్ విద్యాలయం విద్యార్థులు



**తిరుపతి /పూతలపట్టు - సూర్య వాస్తవం:** తిరుపతిలోని కేవీఎస్ మైదానంలో రెండు రోజులు నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మంగళ్ విద్యాలయం (సీబీఎస్ఈ), పేటమిట్ట విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, "విద్యతో పాటు క్రీడల్లోనూ మా విద్యార్థులు ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన 12 మంది విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. రాబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

## ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం అంటూ సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆమె శుక్రవారం తడ మండల పరిధిలోని మాంబట్టు గ్రామంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల సమస్యలు సత్వర పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత అని,అర్జీల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని ఎమ్మెల్యే అన్నారు. అంతేకాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అందజేసిన వినతులను ఎమ్మెల్యే స్వీకరించి,వారితో మాట్లాడారు.అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ప్రజలు వ్యయప్రయాసలకోర్చి ఇచ్చే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి,నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కు 55 మంది తమ సమస్యలను తెలియజేస్తూ వినతి పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాన్ని అధికమించాలి

**- "సిడిపిఓ జ్యోతి కిరణ్ "**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** చిన్నారులు,గర్భవతులు,బాలింతల్లో పోషకాహార లోపంతో పాటు, రక్తహీనత లోపాన్ని అధిగ మించ డానికి తగు చర్యలు చేపట్టాలని సిడిపిఓ జ్యోతి కిరణ్ వెల్లడి ంచారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన పోషణ్ మహ్ అను కార్యక్రమాన్ని మం డల పరిధిలోని చవటకండ్రిగ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే మనం తీసుకునే ఆహార పదార్థాల్లో సమ పోషక విలువలు కలిగి ఉండాలని అన్నారు.ప్రధానంగా ఆరేళ్లలోపు చిన్నారులు,గర్భవతులు,పాలిచ్చే తల్లులు,కిశోర బాలికల్లో పోషకాహార లోప సమస్యను సరిదిద్దాలని పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న ఆకుకూరలు, మునగ,గోంగూర,తదితర దినసరి ఆహారంలో తీసుకోవాలని చెప్పారు.రక్తహీనత పరీక్షలు,పిల్లల ఎదుగుదల వంటి వాటిని పరీక్షించాలని సూచించారు.పాలిచ్చే తల్లులు విధిగా బిడ్డకు తల్లిపాలనే పట్టించాలని తెలియజేశారు.పోషక విలువలు,ఐరన్ కలిగిన కూరగాయలు, ఆకుకూరలు,గుడ్లు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ,ఆరోగ్య సిబ్బంది చెంగమ్మ, వజ్రమ్మ,అంగన్వాడీ కార్యకర్తలు,గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## వట్రపాలెం లో ఆక్రమణలపై తాసిల్దారుకు సిపిఐ ఆధ్వర్యంలో వినతి

**- ఆక్రమణకు గురైన భూములను వెంటనే విడిపించాలి**
**- భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్**

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం లో ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి అయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట తాసిల్దార్ శైలకుమారి కు పట్టణ సమితి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.సూళ్లూరుపేటలో 25వ సంవత్సరాల క్రితమే అప్పటి ఎమ్మార్వో అయినటువంటి విజయభారతి వట్రపాలెం గ్రామ సర్వే నెంబర్లు 22/16,23,24, 27/18 మరియు 27/2లలోని సుమారు 823 ప్లాట్లను మంజూరు చేశారని అప్పటినుంచి 2010 వరకు సుమారు 120 కుటుంబాలు అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని, జీవనం ప్రారంభించాయని,2010 నుంచి ఇప్పటివరకు సుమారు 570 కుటుంబాల వరకు నివసిస్తున్నారు.గతంలో తహసిల్దారుగా ఉన్నటువంటి రవికుమార్ కొన్ని ఇండ్ల పట్టాలను రద్దు చేసియున్నారని, కానీ వట్రపాలెం లే-ఔట్ కు ఆనుకుని వున్నటువంటి ఓ భూస్వామి వట్రపాలంపై కన్నేసి అందులోని ఆరు ఫ్లాట్లు వరకు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం కొనసాగిస్తున్నారని,2012 నుంచి ఆయా స్థలాలలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని,అక్కడ కాపురం ఉన్నటువంటి నిరుపేద కుటుంబాలను ఖాళీ చేయమని చెప్పి బెదిరిస్తున్నారని,అలా కాకుంటే కొంత పైకము తనకు ముట్టచెబితే వారి పేరిట సదరు ప్లాట్లను పభుత్వ రికార్డులలో నమోదు చేయిస్తానని,కాదని మొరాయిస్తే జెసిబి తో మీ ఇండ్లను కూల్చి వేస్తానని వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సూళ్లూరుపేట తాసిల్దార్ కు తెలియజేశారు. వట్రపాళెం గ్రామాన్ని క్షుణ్ణంగా పరిశీలించి,లే-ఔట్ ను సర్వే చేయించి అక్కడ నివసిస్తున్నటువంటి కుటుంబాల వారికి న్యాయం చేయగలరని తహసిల్దార్ కు తెలిపారు.






## సీఎం విజయ్ కుమారుడి దర్శకత్వంలో

## సందీప్ కిషన్.. 'సిగ్మా' ట్రైలర్ విడుదల

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం 'సిగ్మా'. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. యాక్షన్, అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వం వహించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దర్శకుడిగా జేసన్‌కు ఇదే తొలి చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.విడుదలైన ట్రైలర్‌ను బట్టి ఇదొక స్టైలిష్ యాక్షన్, ట్రెజర్ హంట్ మూవీ అని స్పష్టమవుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఛేజింగులు, నిధి అన్వేషణకు సంబంధించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. యాక్షన్, అడ్వెంచర్‌తో పాటు కాస్తంత హాస్యం కూడా జోడించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన కథానాయికగా ఫరియా అబ్దుల్లా నటిస్తోంది. రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన 'సిగ్మా', ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచింది.తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా పంపిణీ హక్కులను ప్రముఖ సంస్థలైన మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ (కోస్తాంధ్ర, తెలంగాణ), ఎస్వీఆర్ సినిమా (సీడెడ్) దక్కించుకోవడం విశేషం.




# ప్రతి సీన్ సర్‌ప్రైజ్ చేస్తుంది...

# 'హతః' చాలా స్పెషల్: కిరణ్ అబ్బవరం




యువ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రయాణం సాగిస్తుండడం తెలిసిందే. ఆయన తన సొంత నిర్మాణ సంస్థ 'కేఏ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి 'హతః' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మిస్టికల్ థ్రిల్లర్ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా, ప్రతి ప్రేక్షకుడిని ఆశ్చర్యపరిచేలా ఉంటుందని కిరణ్ అబ్బవరం ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, ""హతః' మాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఈ దీపావళికి ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రతి సన్నివేశంలోనూ ఉంటుంది. సినిమా పూర్తయ్యాక, అందులోని లింక్ పాయింట్స్ గుర్తుకు తెచ్చుకోవడానికి నాకే పది నిమిషాలు పట్టింది. దర్శకుడిని అడిగి మరీ అన్ని విషయాలు తెలుసుకున్నాను. అంత లోతైన కథ ఇది. నేను నిర్మాతగా ఈ ప్రాజెక్టులోకి మధ్యలో అడుగుపెట్టాను. ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది, అందుకే అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నాం" అని వివరించారు.చిత్ర దర్శకుడు అనుష్ గోరక్ మాట్లాడుతూ, "ఇది ఒక మిస్టికల్ థ్రిల్లర్. హారర్ అంశాలు కూడా ఉంటాయి. కథలో చాలా రహస్యాలు ఉన్నాయి, వాటిని థియేటర్లలో చూస్తేనే ఆ అనుభూతి దక్కుతుంది" అని తెలిపారు. మరో నిర్మాత శివశంకర నాయుడు మాట్లాడుతూ, "ఎలాంటి ప్రాంతీయ హద్దులు లేని అరుదైన సినిమా ఇది. ఏ ప్రాంతం వారు చూసినా తమ కథలాగే అనిపిస్తుంది. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది" అని అన్నారు.బిగ్ బాస్ షోకి వెళ్లకముందే ఈ చిత్రంలో నటించానని నటి తనూజ పుట్టుస్వామి తెలిపారు. మూడేళ్ల తమ ప్రయాణం గురించి, దర్శకుడి విజన్ గురించి ఆమె వివరించారు. కో-ప్రొడ్యూసర్, నటుడు కుష్లు మాట్లాడుతూ, విజువల్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయని, అనుష్ లాంటి దర్శకులు టాలీవుడ్‌కు అవసరమని అన్నారు.రెహమాన్, కుష్లు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు నిర్మిస్తున్నారు. జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేందుకు సిద్ధమవుతోంది.

## కత్రినా కైఫ్‌పై ట్రోలింగ్..

## మద్దతుగా నిలిచిన నటి సోనారికా



బాలీవుడ్ ప్రముఖ నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం బరువు పెరిగారంటూ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న విమర్శలు, ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి సోనారికా భడోరియా తీవ్రస్థాయిలో స్పందించారు. మాతృత్వం పొందిన మహిళల శరీరంలో వచ్చే సహజ సిద్ధమైన మార్పులను ప్రశ్నించడం, వారి రూపాన్ని బట్టి విమర్శించడం అత్యంత విచారకరమని పేర్కొంటూ కత్రినాకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల్లో సుదీర్ఘ పోస్ట్ చేశారు.బిడ్డకు జన్మనివ్వడం అనేది అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, ఆ సమయంలో మహిళ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుందని సోనారికా గుర్తుచేశారు. ఒక నటిగా సమాజంలో ఎంతటి గుర్తింపు ఉన్నప్పటికీ, ఆమె ప్రసవం తర్వాత ఎలా కనిపిస్తోంది లేదా ఎంత బరువు పెరిగింది అనే దానికంటే ఒక బిడ్డకు జన్మనివ్వడానికి ఆమె పడిన శ్రమను, గడిపిన నిద్రలేని రాత్రులను అర్థం చేసుకోవడం ముఖ్యమని చెప్పారు. మాతృత్వం కోసం సర్వస్వం త్యాగం చేయాలని కోరుకునే ఈ ప్రపంచం, ప్రసవానంతరం మహిళ శరీరం మారకూడదని ఆశించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.ఈ తరహా ట్రోలింగ్ వల్ల ప్రసవానంతరం మహిళలు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉందని, నెటిజన్లు కాస్త సున్నితంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. 'జాదుగాడు', 'స్పీడున్నోడు', 'ఈడోరకం-ఆడోరకం' వంటి తెలుగు చిత్రాలతో గుర్తింపు పొందిన సోనారికా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



# 5 ఓవర్లలోనే మ్యాచ్ ఖతం..

# ఆసియా క్రీడల్లో జపాన్‌పై భారత్ విధ్వంసం



ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకునే వేటను ఘనంగా ప్రారంభించింది. ఆతిథ్య జపాన్‌తో జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత జపాన్‌ను 58 పరుగులకే కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత కేవలం 5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.భారత విజయంలో షెఫాలీ వర్మ మెరుపు ఇన్నింగ్స్ కీలకంగా నిలిచింది. 15 బంతుల్లోనే అజేయంగా 40 పరుగులు చేసింది. నాలుగు బౌండరీలు, ఓ సిక్సర్‌తో జపాన్ బౌలర్లను ఉతికారేసింది. గిరిజా కామలినితో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన షెఫాలీ తొలి ఓవర్లోనే నాలుగు ఫోర్లు బాదింది.అయితే కామలిని రెండు బంతుల్లోనే డకౌట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత భారతి ఫుల్మాలి 6 పరుగులకే ఔటైంది. అయినా షెఫాలీ ఏమాత్రం తగ్గలేదు. ఐదో ఓవర్లో మరో మూడు ఫోర్లు బాదిన ఆమె.. సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించింది. రిచా ఘోష్ 6 బంతుల్లో 12 పరుగులు చేసింది. అంతకుముందు భారత బౌలర్లు జపాన్‌ను 58 పరుగులకే పరిమితం చేశారు. ప్రపంచ నంబర్ వన్ టీ20 బౌలర్ శ్రీ చరణి 4 ఓవర్లలో 10 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టింది. షెఫాలీ రెండు వికెట్లు తీయగా.. శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ చెరో వికెట్ సాధించారు. శ్రీలంకపై ఆసియా కప్ ఫైనల్లో 4/20తో రాణించిన చరణి.. జపాన్‌పైనా అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకుంది. దీంతో భారత్ అలవోకగా సెమీఫైనల్ చేరింది.శనివారం జరిగే రెండో సెమీఫైనల్లో భారత్ బంగ్లాదేశ్‌తో తలపడనుంది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక ఢీ కొంటాయి.




## అతడు ఉండగా చింత ఎందుకు?..

## శిఖర్ ధావన్‌తో బంధంపై రోహిత్ శర్మ

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తన ఓపెనింగ్ భాగస్వామి శిఖర్ ధావన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే కార్యక్రమంలో పాల్గొన్న హిట్ మ్యాన్, ధావన్‌ను తన ప్రాణ స్నేహితుడిగా అభివర్ణించాడు. "నా ప్రాణస్నేహితుడు వస్తున్నాడు కాబట్టే ఈరోజు నేను ఇంత ఉత్సాహంగా కనిపిస్తున్నాను" అని రోహిత్ చమత్కరించాడు.ఈ సందర్భంగా నిజమైన స్నేహానికి రోహిత్ శర్మ ఒక చక్కని నిర్వచనం ఇచ్చాడు. "కేవలం మీమ్స్, రీల్స్ పంచుకోవడమే స్నేహం కాదు. డ్రెస్సింగ్ రూమ్ అనుభవాలను, గెలుపోటములను, క్లిష్ట పరిస్థితులను, మైదానంలో ఓపెనింగ్ బాధ్యతలను పంచుకోవడమే నిజమైన స్నేహం" అని ఆయన అన్నాడు. జూనియర్ స్థాయి నుంచే తామిద్దరం కలిసి పోటీ క్రికెట్ ఆడటంతో తమ మధ్య ఇంతటి బలమైన బంధం ఏర్పడిందని వివరించాడు.ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే సమయంలో తనపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని రోహిత్ తెలిపాడు. "శిఖర్‌తో ఆడుతున్నప్పుడు నాపై ఒత్తిడి తగ్గుతుందని ఎప్పుడూ భావించేవాడిని. ఎందుకంటే అతను ఆ ఒత్తిడిని తనపైకి తీసుకుని, నా వరకు రాకుండా చూసేవాడు. అందుకే నేను ఎప్పుడూ 'శిఖర్ ఉండగా చింత ఎందుకు' అని అనుకుంటాను" అని రోహిత్ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీలలో ఒకటిగా నిలిచిన వీరిద్దరి స్నేహం, క్రికెట్ ప్రయాణాన్ని ఈ ఎపిసోడ్ ఆవిష్కరించింది.

## డాసన్, బాంటన్ మెరుపులు.. ఇంగ్లాండ్

## మరో ఘనవిజయం




కార్డిఫ్‌లో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో శ్రీలంకపై ఆరు వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించిన ఇంగ్లాండ్, ఆ జట్టుపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించడమే కాకుండా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో తిరుగులేని ఆధిక్యాన్ని దక్కించుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఆరంభంలో దూకుడుగా ఆడినప్పటికీ, లియామ్ డాసన్, జేమీ ఓవర్టన్ వారి జోరుకు అడ్డుకట్ట వేశారు. అనంతరం టామ్ బాంటన్ వేగవంతమైన అర్ధశతకంతో రాణించడంతో, ఇంగ్లాండ్ దాదాపు ఎనిమిది ఓవర్లు మిగిలి ఉండగానే విజయాన్ని సాధించింది.శ్రీలంక చివరకు 146/9 స్కోరుతో ఇన్నింగ్స్ ముగించినప్పటికీ, వారి ఆరంభం మాత్రం అంతకంటే మెరుగైన ఫలితాన్ని సూచించేలా సాగింది. ముఖ్యంగా పాతుమ్ నిస్సాంక దూకుడుగా ఆడుతూ జోఫ్రా ఆర్చర్ వేసిన మొదటి ఓవర్‌లోనే మూడు బౌండరీలు బాదాడు. ఒక దశలో 9 బంతుల్లో కేవలం 1 పరుగు మాత్రమే చేసిన లహిరు ఉదార ??కూడా ఆ తర్వాత వేగం పుంజుకున్నాడు. బౌండరీల వర్షం కురవడంతో, శ్రీలంక ఐదవ ఓవర్ మధ్యలోపే 50 పరుగుల మార్కును వేగంగా అందుకుంది.

# రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీకి గుర్తింపు ఉంది

**- దుష్ప్రచారాలు అవాస్తవం**
**- తేల్చి చెప్పిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి**



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీకి భారత ఎన్నికల సంఘంలో గుర్తింపు ఉందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ డైరెక్టర్ రామారావు తనకు దేశంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల జాబితాను పంపించారని ఆయన వెల్లడించారు. ఆ జాబితాలో 65వ నంబర్‌లో రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ పేరు ఉందని డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిధిలో పార్టీకి సంబంధించిన గుర్తింపు కొనసాగుతోందని, దీనికి సంబంధించి అధికారిక జాబితాలో తమ పార్టీ పేరు ఉండటమే ఆధారమని ఆయన తెలిపారు. గతంలో కొందరు వ్యక్తులు తమ పార్టీ పట్ల గిట్టని భావంతో, పనిగట్టుకుని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ రద్దయిందంటూ దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. అయితే ఎన్నికల సంఘానికి సంబంధి ,ంచిన తాజా జాబితా ద్వారా ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమైందన్నారు.ప్రజల్లో అయోమయం సృష్టించే విధంగా అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఆయన అన్నారు. రాజకీయ పార్టీకి సంబంధించిన గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై అధికారిక సంస్థల నుంచి వచ్చే సమాచారాన్నే ప్రజలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాయలసీమ ప్రాంత సమస్యలు, ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ అభివృద్ధి అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. రాయలసీమకు సంబంధించిన అంశాలపై నిరంతరం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పార్టీ తరఫున కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు.తమ పార్టీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలను అధికారిక సమాచారం ద్వారా తెలుసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల సంఘం జాబితాలో పార్టీ పేరు ఉండటం తమ వాదనకు స్పష్టమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు

## మంచి పోషణతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించండి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** మంచి పోషణతో కూడిన ఆహారాన్ని పిల్లలకి అందించాలని సిడిపిఓ జహ్రాబి పేర్కొన్నారు. మన అంగన్వాడీ మన భాద్యత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చింతకుంటవాండ్ల పల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణతో కూడిన పదార్థాలను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరమల పిల్లల తల్లుల కు ప్రీ స్కూల్ యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం పోషణతో కూడిన పదార్థాలు అందించాలన్నారు. చిన్నపిల్లలకు గర్భవతులకు సకాలంలో పాలు,గుడ్లు ఆకుకూరలు అందించాలన్నారు. బాలింతలకు మంచి పోషణతో కూడిన పదార్థాలు,ఆకుకూరలు పప్పు దినుసులు పదార్థాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ హుస్సేనమ్మ, రూపా లక్ష్మి, అయిషా, శారద, స్వప్న,అంగన్వాడి వర్కర్లు,ఆయాలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఆర్.రాజగోపాల్ రెడ్డి వర్ధంతి

**- నివాళి అర్పించిన హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు,**
**మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి**



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** లక్కిరెడ్డిపల్లి లోని రెడ్డివారిపల్లి రోడ్డులో కీర్తిశేషులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రెడ్డప్పగారి రాజగోపాల్ రెడ్డి 13 వ వర్ధంతి సందర్భంగా అయన ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సతీమణి ఆర్. హేమలతమ్మ ఆయన కుమారులు హిందూపురం పార్లమెంటు పరిశీలకులు, లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి, ఆర్. శ్రీనివాసరెడ్డి, అయన మనమడు ఆర్. శ్రవణ్ రాజ్ రెడ్డి, చిన్న కోడలు కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి ఆర్ ఆర్ ఘాట్ వద్ద శుక్రవారం ఘనంగా నివాళు లర్పించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాసేవలో అలుపెరుగని యోధునిగా ఎనిమిది శతాబ్దాలు పైబడి జీవించి అందరి హృదయాలలో మంచితనానికి మారుపేరుగా నిలిచి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి సమాజ శ్రేయస్సుకు మా ఉన్నతికి అహర్నిశలు కృషి చేసిన మా తండ్రి పరవధించి నేటికీ 13 సంవత్సరాలు గడిచినను ఆయన జ్ఞాపకాలు మా మదిలో పదిలంగా ఉంటాయని ఏ లోకంలో ఉన్న ఆయన ఆశీస్సులు మాకు అందించాలని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగజేయాలని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన ఘాట్ వద్ద ప్రార్థించారు. తండ్రిగారైన మాజీ మంత్రి లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఆర్. రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని ఈ సందర్భంగా ఆయన తనయులు మాజీ ఎంఎల్ఏ ఆర్. రమేష్ కుమార్ రెడ్డి పోలిట్ బ్యూరో మాజీ సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి లు పేర్కొన్నారు. వారితోపాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లో కాలాడి ప్రభాకర్ రెడ్డి, మద్దిరేవుల రమేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, జడ్పిటిసిలు సర్పంచులు ఆర్ ఆర్ అభిమానులు, కార్యకర్తలు, ఆర్ ఆర్ ఘాటు వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్‌ఆర్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం

**- భజన బృందం చేత భజనలు**
**- చెల్లెమ్మ కుమారి మారెడ్డి సువర్ణ లక్ష్మీ జ్ఞాప కార్థం అన్నదానం**
**భజన కార్యక్రమం ఏర్పాటు చేసిన అన్నయ్య మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**




**జమ్మలమడుగు - సూర్య వాస్తవం :** పట్టణంలోని నాగులకట్ట బిసి హాస్టల్ ఎదురుగా ఏరదంతా యూత్ కమిటీ వారి అధ్వర్యంలో కొలువైన వినాయకుని ప్రాంగణంలో 350 మంది భక్తులకు కుమారి మారెడ్డి సువర్ణ లక్ష్మీ జ్ఞాపకార్థం తన అన్నయ్య ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మరియు రోటరీ క్లబ్ ప్రసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా పంతులు జనార్దన్ గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం గోత్ర నామాలు చదివారు. గణేష్ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని తన చెల్లెమ్మ కుమారి సువర్ణ లక్ష్మీ గుర్తుగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడము జరిగింది అన్నారు. అన్నదాన కార్యక్రమము అనంతరం గణేష్ మండపంలో తన సొంత గ్రామమునకు కర్మలవారిపల్లె కు చెందిన భజన భక్తుల బృందము చేత భజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భజన బృందం సభ్యులు భజన పాటలతో భక్తులను అలరించేలా పాటలు పాడి భజనలు చేశారు. అనంతరం తన చెల్లెమ్మ గుర్తుగా భజన బృందం సభ్యులకు కూలింగ్ వాటర్ బాటిల్స్ ను అంద చేశారు. తన తోడ బుట్టిన చెల్లెమ్మ 16.1.2010 వ సంవత్సరం న లోకాన్ని విడచి 16 సంవత్స రాలు అయినప్పటికీ ఆమె గుర్తుగా మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు అన్నయ్య వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీమణి రాధ, కుటుంబ సభ్యులు విశ్రాంత ఉపాధ్యాయుడు యమ్.యల్ క్రిష్ణారెడ్డి, భాగ్య లక్ష్మీ, డాక్టర్ యమ్.పుష్పాంజలి, మరియు డి.రామ సుబ్బారెడ్డి, ఎక్స్ సర్పంచ్ యమ్.సి.పుల్లారెడ్డి, నాగ లక్షమ్మ మరియు భక్తులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామానికి చెందిన తిప్పన జయరామ నాయుడు(రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి) ఈ నెల 5వ తేదీన అకాల మరణం చెందిన విషయం తెలిసిందే.ఈ విషయం తెలుసుకున్న మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఆయన కుమారుడు తిప్పన నాగేంద్ర (విలేకరి)వారి తల్లిగారిని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. జయరామ నాయుడు మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ చిలేకాంపల్లె వీరనారాయణ రెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి,జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి,ఎమ్మెల్యే సోదరుడు పుట్టా ప్రభాకర్ యాదవ్ స్థానిక ఎంపీడీవో రామచంద్రారెడ్డి, స్థానికులు ఆవుల దస్తగిరి,తిప్పన నారాయణ,సారె వెంకటేశ్వర్లు,టీడీపీ నాయకులు ఆకుల వినోద్, తిప్పన సురేష్, పుటాల శివ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సేవలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్న మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆయన రాకతో మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పనికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదంగా అందజేశారు. ఆయన వెంట దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, ఎస్సై శివప్రసాద్,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లిసుబ్బారెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలిరెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, దత్తాత్రేయ స్వామి,మేకల సుధాకర్, పూజ శివయ్య యాదవ్, రెడ్లదిన్నె నాగ ఖాదరయ్య, ఆది బోయిన గురవయ్య, బోల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్యఘర్ పి. ఎం.పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్యఘర్ పి. ఎం.పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ లివింగ్ స్టోన్ పేర్కొన్నారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారి 76 వ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సభా భవనంలో పీఎం సూర్య ఘర్ పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ లివింగ్ స్టోన్ మాట్లాడుతూ...పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజనఅనేది ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుతమైన పథకం అన్నారు.నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం తో పాటు,విద్యుత్ బిల్లుల భారం తగ్గించి, గ్రీన్ ఎనర్జీని (హరిత శక్తి) ప్రోత్సహించడం అని తెలియజేశారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుండి గరిష్టంగా రూ. 78,000 వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు.ఒక కిలోవాట్ యూనిట్‌కు రూ. 30,000, రెండు కిలోవాట్లకు రూ. 60,000, మూడు కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి రూ. 78,000 చొప్పున సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు .సుమారు 7% వడ్డీతో కొల్లాటరల్-ఫ్రీ (హామీ లేని) బ్యాంక్ రుణాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.దరఖాస్తు చేసుకునే విధానం అధికారిక వెబ్‌సైట్ పీఎం సూర్య ఘర్ Portal ను సందర్శించండన్నారు. కన్స్యూమర్ పేజీలోకి వెళ్లి మీ రాష్ట్రం, డిస్కం కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసు కోండన్నారు. లాగిన్ అయి సోలార్ రూఫ్‌టాప్ కోసం దరఖాస్తు చేయండన్నారు. డిస్కం నుండి ఫీజుబులిటీ అప్రూవల్ వచ్చిన తర్వాత, రిజిస్టర్డ్ వెండర్ ద్వారా ప్లాంట్ ఇన్‌స్టాల్ చేయించుకోవాలన్నారు.ఇన్‌స్టాలేషన్ పూర్తయ్యాక నెట్ మీటర్ పెట్టి, పోర్టల్ ద్వారా కమిషనింగ్ సర్టిఫికేట్ పొందాలన్నారు.రిపోర్ట్ అందిన తర్వాత మీ బ్యాంక్ వివరాలు సమర్పిస్తే సబ్సిడీ అమౌంట్ మీ ఖాతాలో జమ అవుతుంది అనే బ్యాంకు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాదమునిస్వామి, లక్కిరెడ్డిపల్లి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరినాథ్, రామాపురం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఏ లక్ష్మయ్య మరియు ఈఆర్ఓ సిబ్బంది, పరిపాలన అధికారి చంద్రమౌళి, మెయిన్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ కుర్నూతుల స్టేట్ బ్యాంక్ మేనేజర్ గోవర్ధన్, ఆంధ్ర ప్రదేశ్ బ్యాంక్ మేనేజర్ తేజస్వినీ, ఎం ఈ ఓ చక్రే నాయక్, బిజెపి కడప జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల రామకృష్ణ రెడ్డి, విద్యుత్ సిబ్బంది, సోలార్ వెండార్స్ మరియు సోలార్ వినియగదారులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం




**నరసరావుపేట - సూర్య వాస్తవం :** స్థానిక పల్నాడు రోడ్‌లో గల శ్రీ.త్రికోటేశ్వర స్కాన్ సెంటర్‌లో ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ లింగస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న పిల్లలకు ఉచితంగా గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మంది చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు ఉన్న చిన్న పిల్లల తల్లితండ్రులు ఎవరు డబ్బుల గురించి ఆలోచించకుండా వారి పిల్లలను ఇలా మహేష్ బాబు ఫౌండేషన్ వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పుడు తీసుకొని వస్తే వాళ్లను పరీక్షించి అవసరమైన వారికి హీరో మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. పల్నాడుజిల్లా, టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో కృష్ణ అభిమానులు డాక్టర్ లింగస్వామి ని కలిసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభిమానులు సుభాని, నాగేశ్వరరావు, బాజీ, షాజహాన్ థామస్, సుభాని ,వినుకొండ ఫరీద్, కరీం, సుబ్బారావు ఆంధ్రా హాస్పిటల్స్ రిలేషన్ మేనేజర్ ప్రసాద్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .

# డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత

**- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య**



**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల అర్బన్ పరిధిలోని యర్రంరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం 'ఫ్రైడే -- డ్రై డే' కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్త, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇళ్లలో మరియు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ప్రతి శుక్రవారం 'ఫ్రైడే -- డ్రైడే' పాటించాలి**

ప్రతి శుక్రవారం ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లోని నీటి నిల్వలను పరిశీలించి, అవసరం లేని నీటిని తొలగించాలని సూచించారు. కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, ఖాళీ డబ్బాలు, నీటి తొట్టెలు తదితర వాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. నిల్వ నీటిలో దోమల లార్వాలు కనిపిస్తే వెంటనే వాటిని తొలగించి, పాత్రలను శుభ్రం చేయాలని సూచించారు.

**ప్రధాన నివారణ చర్యలు:**

నీటి నిల్వ పాత్రలను ఎల్లప్పుడూ మూతపెట్టి ఉంచాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి కూలర్లు, నీటి తొట్టెలు, ఇతర నీటి పాత్రలను పూర్తిగా శుభ్రం చేయాలి. దోమల నివారణకు దోమతెరలు, ఉపయోగించాలి. సాధ్యమైనంత వరకు ఇంటి తలుపులు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు, వాంతులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. వైద్యుల సూచన లేకుండా మందులు స్వయంగా వాడకూడదు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జ్వరం వంటి లక్షణాలు కనిపించినప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైతే వెంటనే వైద్యులను సూచించారు. దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రతి కుటుంబం వారానికి ఒక రోజు పది నిమిషాలు కేటాయించి నీటి నిల్వలను పరిశీలిస్తే దోమల వృద్ధిని గణనీయంగా అరికట్టవచ్చు. డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత" అని సిద్దయ్య తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, శ్రీమతి ప్రశాంతి, ఆశా కార్యకర్త నాగేశ్వరీతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నూతన సోలార్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా

**- పీఎం కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాకు మరో ముందడుగు**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లెలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో పీఎం కుసుమ్––ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద ఏర్పాటు చేసిన 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు ఈ సోలార్ ప్లాంట్ ద్వారా రోజుకు సుమారు 30000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది ఈ విద్యుత్‌ను 1250 వ్యవసాయ విద్యుత్ సర్వీసులతో పాటు 2300 గృహాలకు వినియోగించేలా ఏర్పాట్లు చేశారు ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులతో పాటు మేఘా సోలార్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్లాంట్ పనితీరును పరిశీలించి విద్యుత్ ఉత్పత్తి మరియు సరఫరా వివరాలను తెలుసుకున్నారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ విద్యుత్ రంగంలో సౌర విద్యుత్ వినియోగం పెంపు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సోలార్ ప్లాంట్ నిర్వాహకులు తెలుగుదేశం పార్టీ నాయకులు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# రూ.3 కోట్లతో శ్రీ ఈశ్వరీమాత మందిరం పునర్నిర్మాణానికి భూమిపూజ





**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రమైన కంది మల్లాయ పల్లెలో సుమారు 275 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ ఈశ్వరీమాత జీవ సమాధి మందిరం పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. జీర్ణావస్థకు చేరుకున్న పవిత్ర మందిరాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆమోదించిన ఉత్తర్వుల ప్రకారం పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమిపూజ శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీ ఈశ్వరీమహాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠ సంప్రదాయం ప్రకారం మఠాధిపతులు శ్రీ వీరశివ కుమారస్వాములవారు ఎమ్మెల్యేకు శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసినట్లు మఠం కార్యనిర్వహణాధికారి బి.వి. జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా దేవాదాయ శాఖ జిల్లా అధికారి శంకర్ బాలాజీ, స్థానిక మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు పుట్టా ప్రభాకర్ యాదవ్, స్థానిక ఎంపీపీ చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కాణాల మల్లికార్జునరెడ్డి, శ్రీ దత్తాత్రేయ స్వామి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డి, టిడిపి మండల నాయకులు ముడుమాల పోలిరెడ్డి,పూజా శివయాదవ్, మేకల సుధాకర్, సంపత్ కుమార్ స్వామి,తదితరులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# సప్తగిరి సర్కిల్‌లో... ఘనంగా గణేష్ శోభాయాత్ర...!

**- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు భద్రత**

**- ఓంకారం పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లా కేంద్రంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక శోభాయాత్రను జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓంకారం పతాకాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. భక్తులందరూ ఆధ్యాత్మిక చింతనతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించి విజయవంతంగా ముగించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. శోభాయాత్ర కొనసాగే ప్రధాన రహదారులు, కీలక కూడళ్లలో ఎస్పీ స్వయంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పోలీసు బందోబస్తును పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రశాంతమైన వేడుకలు, ప్రజల భద్రతే తమ బాధ్యత అని అనంతపురం జిల్లా పోలీసులు తెలిపారు.



# వికసిత్ భారత్... లక్ష్య సాధనపై కీలక చర్చలు...!

**- ఢిల్లీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్**



**అనంతపురం – సూర్య వాస్తవం :** వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన ఆర్థిక వనరులు, పెట్టుబడుల సమీకరణ, దేశ ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై ఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'ఫైనాన్సింగ్ ఇండియాస్ జర్నీ టువార్డ్స్ వికసిత్ భారత్' కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సదస్సులో దేశ ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, రాష్ట్రాల ఆర్థిక పురోగతి, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కేంద్ర–రాష్ట్రాల సమన్వయం తదితర అంశాలపై కీలకంగా చర్చించారు. దేశ అభివృద్ధి వేగాన్ని పెంచేందుకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ, పెట్టుబడులను ఆకర్షించే విధానాలు, రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేసే అంశాలపై సదస్సులో అభిప్రాయాల మార్పిడి జరిగింది.

# వీరభద్రుని సన్నిధిలో శుద్ధ జల నీటి పథకం ప్రారంభం



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని తమ్మళ్ళపల్లి పొలిమేర ప్రాంతంలో, పెద్దవడుగూరు గ్రామానికి సమీపంలో గల భద్రకాళి వీరభద్రస్వామి (గుడ్ల వీరన్న) దేవాలయ ఆవరణంలో సోమవారం శుద్ధ జల పథకంలో ప్రారంభిస్తున్నట్లు దేవాలయ కమిటీ వారు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటి ఇలవేల్పు వీరభద్రస్వామి భక్తులందరూ 21 9 2026వ తేదీ సోమవారము ఉదయం 9 గంటలకు శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో శుద్ధజలనీటిపథకం,, (వాటర్ ప్లాంట్) ప్రారంభోత్సవం జరుగునున్నందున యావన్మంది భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమానికి వాటర్ ప్లాంట్ దాతలు గుత్తి మురళీమోహన్ రెడ్డి, గుత్తిఅనంతపురం మాజీ సర్పంచు, శేషానందరెడ్డి, బాల వికాస్ ట్రస్ట్ అధినేత, బాల మోహనరెడ్డి, తానేశ్వరరెడ్డి, వీరభద్రస్వామి ఆలయ కమిటీ మరియు వీరభద్రస్వామి భక్తుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరుగునని పేర్కొన్నారు.కావున భక్తులందరూ ఉదయం8,30 గంటలకు వీరభద్రస్వామి దేవాలయం దగ్గరకు చేరుకోవాల్సిందిగా వారు కోరడమైనది.

# వాసవి భారీ గణపతి నిమర్జనం



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో వాసవినగర్ లోని బారీ వినాయకుని విగ్రహాన్ని శుక్రవారం ఊరేగింపులతో నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వాసవి గణపతి కమిటీ మాట్లాడుతూ వినాయకుడు కొలువై ఐదు రోజుల సందర్భంగా కాలనీవాసులందరూ ఎంతో ఉత్సాహంగా అన్ని కులస్తులవారు నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరమన్నారు. ఇది మూడవ సంవత్సరం వినాయక ఉత్సవముగా పేర్కొన్నారు. తిలకించి దర్శించడానికి భక్తాదులు అందరికీ ఉదయం నుంచి తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మేళ తాళాలతో, డ్రమ్స్, డీజే వాయిద్యాలకు యువకులు నృత్యాలు కేరింతలతో అంగరంగ వైభవంగా భారీ ఊరేగింపుతో బాయ్ బాయ్ గణేశ, గణపతి బప్పా వర్షం కురిపించు అప్పా అంటూ నినాదాలతో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్లారు.